సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 11 । ఆగస్టు । 2024



ఘనంగా తులసీదళార్చన

విశాఖ: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో సహస్ర తులసీదళార్చన, విశేష పూజలు ఘనంగా నిర్వహించారు.



అలరించిన డ్యాన్స్ ఫెస్టివల్

విశాఖ: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అలరించిన డ్యాన్స్ ఫెస్టివల్‌లో ప్రతిభ కనబరిచిన చిన్నారులను సత్కరించారు.



'అయోధ్య' ధనస్సుకు పూజలు

విశాఖ: అయోధ్యలో రామునికి అలంకరించే వెండి ధనుస్సుకు నగరంలోని శ్రీ కోదండ రామాలయంలో పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

తొమ్మిది బియ్యం బస్తాలు మాయం

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు

కొయ్యూరు: పోలీసులు స్వాధీనం చేసుకుని రెవెన్యూ శాఖకు అప్పగించిన పీడీఎస్ బియ్యంలో తొమ్మిది బస్తాల మాయమయ్యాయి. పోలీసుల నుంచి జీసీసీ గోదాంకు వెళ్లే సమయంలో ఈ తొమ్మిది బస్తాలు ఎలా మాయం అనేదానిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సామాజిక సేవకుడు అర్జున్‌రెడ్డి శనివారం కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. మూడు రోజుల క్రితం రాజవొమ్మంగి నుంచి కృష్ణదేవిపేట వైపు వెళ్తున్న 54 బస్తాల (2,700 కిలోలు) బియ్యాన్ని కొయ్యూరు ఎస్ఐ రామకృష్ణ స్వాధీనం చేసుకున్నారు. వీటిని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. వారు వీటిని కృష్ణదేవిపేట ఎంఎల్ఎస్ గోదాంకు తరలించాలని ఆర్ఎస్ డీటీ అప్పన్నకు అందజేశారు. అయితే జీసీసీ అధికారులకు 54 బియ్యం బస్తాల్లో 45 మాత్రమే ఇచ్చినట్టు సమాచారం. అయితే మిగతా తొమ్మిది బస్తాల బియ్యం ఏమయ్యాయన్నది తెలియాల్సి ఉంది. దీనిపై జీసీసీ బీఎం విజయకుమార్, గోదాం ఇన్‌చార్జి ధర్మరాజ్‌ను వివరణ కోరగా ఆర్ఎస్ డీటీ 45 బియ్యం బస్తాలు మాత్రమే తమకు అందజేశారని చెప్పారు.

వసతి గృహాల్లో సమస్యలపై ఏఐఎస్ఎఫ్ ధర్నా



ఐటీడీఏ ఔట్ గేటు వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

పాడేరు : గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల్లో వర్కర్ల పోస్టులను భర్తీ చేయాలని, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె. రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఐటీడీఏ ఔట్ గేటు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో మంజూరు పోస్టుల ద్వారా వర్కర్ల పోస్టులను భర్తీ చేయకపోవడంతో విద్యార్థులకు వచ్చే మెస్ చార్జీల నుంచి మినహాయించి వర్కర్లకు జీతాలు చెల్లిస్తున్నారన్నారు. దీనివల్ల వారికి మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందడం లేదన్నారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో వర్కర్ పోస్టులను భర్తీ చేసి రాష్ట్ర ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు మస్తాన్, నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తెలంగాణ విద్యార్థి మృతి

- ఆటోను ఢీకొట్టిన కారు



విద్యార్థి దీపక్ మృతదేహం

ఎటపాక: మండలంలోని తునికిచెరువు గ్రామం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ఆశ్రమ పాఠశాల విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం బండారుగూడెం గ్రామానికి చెందిన కుంజా దీపక్(14) అదే మండలంలోని కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. రెండు రోజులు పాఠశాలకు సెలవులు రావడంతో శనివారం ఉదయం మరో ముగ్గురు విద్యార్థులతో కలిసి పాఠశాల నుంచి ఆటోలో ఇంటికి బయలుదేరాడు. ఈక్రమంలో ఎటపాక మండలం మీదుగా వెళ్తుండగా తునికి చెరువు గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటో దీపక్‌పై పడటంతో విద్యార్థి తలకు తీవ్ర గాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని, కారు డ్రైవర్ పరారీలో ఉన్నట్టు ఏఎస్ఐ చంటిబాబు తెలిపారు.

ఒకటి నుంచి ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు


అల్లిపురం: ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు సెప్టెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు, జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ తెలిపారు. శనివారం అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు.



పెదబయలు: సిలయేరులా పిట్టలబొర్ర జలపాతం



ముంచంగిపుట్టు: కొండల మధ్య నుంచి జాలువారుతున్న డుడుమ జలపాతం



జి.మాడుగుల: పాల నురగలా కొత్తపల్లి జలపాతం



మోతుగూడెం: పొల్లూరు జలపాతం పరవళ్లు

ప్రకృతి ఒడిలో పరవళ్లు



ముంచంగిపుట్టు: వరద నీటితో బురదగుంట జలపాతం

ఎటుచూసినా ప్రకృతి అందాలు.. చుట్టూ పచ్చని చెట్లు... కొండకోనల మధ్య నుంచి పరవళ్లు తొక్కుతూ హోరెత్తే నీటి హొయలు, ప్రకృతి ఒడిలో పాల ధారలా జాలువారుతున్న జలపాతాలు మన్యం సొంతం. జిల్లాతోపాటు సరిహద్దు ఒడిశా రాష్ట్రంలో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు భారీగా నీరు చేరడంతో పొంగి ప్రవహిస్తూ కనువిందు చేస్తున్నాయి.

– ముంచంగిపుట్టు/జి.మాడుగుల/పెదబయలు/మోతుగూడెం



పెదబయలు: కనువిందు చేస్తున్న కిలుముల జలపాతం

కాఫీ తోటల్లో అంతరపంటగా సుగంధ ద్రవ్యాల సాగు

రైతులకు కలెక్టర్ దినేష్‌కుమార్ సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: కాఫీతోటల్లో అంతరపంటగా అధిక లాభాలు ఇచ్చే సుగంధ ద్రవ్యాల సాగు చేపట్టి మరింత ఆదాయం పొందాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. మండలంలోని మోదాపల్లిలో కాఫీ తోటలను శనివారం ఆయన సందర్శించారు. కాఫీపంట సాగు, దిగుబడి, పల్పింగ్, పార్చుమెంట్ కాఫీ తయారీ,అమ్మకాలపై గిరిజన రైతులతో మాట్లాడారు. వారి నుంచి సమస్యలు తెలుసుకున్నారు. కాఫీ రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడ్డామని వారు వివరించారు. తమకు డీజిల్ పల్పింగ్ యూనిట్లు, నిచ్చెనలు మంజూరు చేయాలని, గ్రామం నుంచి కాఫీతోటల వరకు రహదారి సౌకర్యం కల్పించాలని, గ్రామంలో అంగన్‌వాడీ భవనానికి మరమ్మతులు చేయాలని వారు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిరియం పాదుల కోసం సిల్వర్ ఓక్ మొక్కలు నాటే సమయంలో వాటితో పాటు మామిడి, నేరేడు వంటి పండ్లజాతుల మొక్కలు పెంచాలని సూచించారు. కాఫీతోటల్లో అంతరపంటగా అత్యధిక లాభాలు వచ్చే జాజికాయ, జాపత్రి, లవంగం,యాలకులు వంటి స్పైసెస్ మొక్కలు వేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చునన్నారు. కొన్ని ప్రాంతాలను ఎంపికచేసి ట్రయిల్ బేసెస్‌లో జాజికాయ, యాలకులు వంటి మొక్కలు పెంచేందుకు అవకాశాలపై అధ్యయనం చేస్తామని కలెక్టర్ తెలిపారు. అలాగే రైతులకు కావాలిసిన బేబీ, డీజిల్ పల్పర్ యూనిట్లు, నిచ్చెనలు వివిధ పథకాల ద్వారా అందించేందుకు అవకాశాలను పరిశీలించాలని జిల్లా ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్‌రావు,స్పైసెస్ బోర్డు సీనియర్ క్షేత్ర అధికారి బి.కళ్యాణిని ఆదేశించారు. న్యూఢిల్లీకి చెందిన ఎస్‌టీడీఎఫ్ ఎండ్‌లైన్ సర్వే అధికారి పి.సామ్‌రత్నాకర్ ఫిలిప్స్, మోదాపల్లి ఎఫ్‌పీవో అధ్యక్షుడు కె.సూరిబాబు, కార్యదర్శులు బి.దేవి, రత్నాకర్‌రాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ న్యాయ మహాశిల్పంపై దాడికి నిరసన

అరకులోయలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



అంబేడ్కర్ న్యాయ మహాశిల్పంపై దాడికి నిరసనగా వైఎస్సార్ సీపీ కొవ్వొత్తుల ర్యాలీ

అరకులోయ రూరల్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ మహాశిల్పంపై టీడీపీ శ్రేణులు దాడికి నిరసనగా మండల కేంద్రం అరకులోయలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అరకు ఎంపీ తనూజరాణి, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సూచనల మేరకు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సదర్భంగా వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహంపై దాడి టీడీపీ రాజకీయ కుట్ర అని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీని రాజకీయంగా ఎదుర్కొలేక కూటమి ప్రభుత్వం విధ్వంసాలకు తెరలేపుతుందన్నారు. అంబేడ్కర్ విగ్రహంపై దాడి ఎస్సీ,ఎస్టీ దళితులపై దాడి చేయడమే అన్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసమే బడుగు బలహీనవర్గాలపై కపట ప్రేమ చూపిస్తుందని ఆరోపించారు. దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మహిళ విభాగం జిల్లా అధికార ప్రతినిధి కొర్రా రాధిక, మండల ప్రధాన కార్యదర్శి మొస్య రంజిత్ కుమార్, నాయకులు పరుశురాం, సోమేష్, గెన్ను, బొజ్జ, నాగేశ్వరరావు, శివ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ

పాడేరు : రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పూర్తిగా ఖూనీ అయిందని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పంపై దాడి చేయడంపై శనివారం సాయంత్రం పాత బస్టాండ్ అంబేడ్కర్ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును ఖండించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ దాడి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు జరిగిన అవమానంగా భావిస్తున్నామని చెప్పారు. అధికారమదంతో టీడీపీ శ్రేణులు ఒక వైపు వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు, హత్యలకు తెగబడుతున్నారని.. మరోవైపు విగ్రహాల ధ్వంసానికి దిగుతున్నారని విమర్శించారు. ఇటువంటి దాడులను ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు, కుజ్జెలి సర్పంచ్ గబ్బాడ చిట్టిబాబు, కించూరు సర్పంచ్ వంతాల రాంబాబు, మాజీ సర్పంచ్‌లు శరభ సూర్యనారాయణ, పాంగి నాగరాజు, సిరగం దశమూర్తి, మినుముల కన్నాపాత్రుడు, పార్టీ సీనియర్ నాయకులు బూర మహేష్, మాదెల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



పాడేరులో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, పార్టీ శ్రేణులు

వైఎస్సార్ కాంగ్రెస్‌కు పెరిగిన బలం

- ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నిక ఓటర్ల నమోదు
- కొత్తగా ముగ్గురు దరఖాస్తు
- 838 మంది సభ్యులతో జాబితా సిద్ధం
- 13న తుది జాబితా ప్రకటన

మహారాణిపేట (విశాఖ) : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మరింత బలం పెరిగింది. ఆరు వందలకుపైగా ఓటర్లతో ఇప్పటికే స్పష్టమైన ఆధిక్యత ఉండగా మరో ముగ్గురు ఓటు నమోదు చేసుకున్నారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోసం ఓటర్లు నమోదు కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈనెల 3వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించగా.. కొత్తగా రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, డాక్టర్ కుంభా రవిబాబు దరఖాస్తు చేశారు. వీటిని విచారణ కోసం జీవీఎంసీకి పంపారు. ఈనెల 13న తుది జాబితాను ప్రకటిస్తారు.

ఓటర్ల వివరాలు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 838 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 39 మంది జెడ్పీటీసీల్లో ప్రస్తుతం 36 మంది జెడ్పీటీసీ ఉన్నారు. అల్లూరి జిల్లాకు చెందిన హుకుంపేట జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం అరకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రావికమతం జెడ్పీటీసీ తలారి రమణమ్మ, సబ్బవరం జెడ్పీటీసీ తుంపాల అప్పారావు చనిపోయారు. ప్రస్తుతం ఉన్న జెడ్పీటీసీల్లో వైఎస్సార్‌సీపీకి 34 మంది, టీడీపీకి నర్సీపట్నం జెడ్పీటీసీ, సీపీఎంకి అనంతగిరి జెడ్పీటీసీ ఉన్నారు. మొత్తం 652 మంది ఎంపీటీసీలకు గాను 636 మంది ఉన్నారు. 16 మంది ఎంపీటీసీ పదవులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో వైఎస్సార్ సీపీకి 477 మంది, టీడీపీకి 116 మంది, ఇండిపెండెంట్లు 28 మంది, జనసేనకు ఇద్దరు, బీజేపీకి ఆరుగురు, సీపీఐకి ఇద్దరు, సీపీఎంకి ముగ్గురు, కాంగ్రెస్‌కు ఇద్దరు సభ్యులు ఉన్నారు. జీవీఎంసీలో 98 మంది కార్పొరేటర్లకు గాను ఒక స్థానం ఖాళీగా ఉంది. యలమంచలి పురపాలక సంఘం పరిధిలో 25 మంది కౌన్సిలర్లు, నర్సీపట్నం పురపాలక సంఘం పరిధిలో 28 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అలాగే ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభ్యులుగా ఉన్నారు.

గిరిజన నిరుద్యోగ యువతకు ఉచిత డీఎస్సీ శిక్షణ

- రేపటి నుంచి ఈనెల 17 వరకు దరఖాస్తుల స్వీకరణ
- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



పాడేరు : స్థానిక ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల నిరుద్యోగ గిరిజన యువతకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నామని ఐటీడీఏ పీవో వి. అభిషేక్ తెలిపారు. డిగ్రీ, బీఈడీ, డీఈడీ, టెట్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఐటీడీఏలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ వద్ద ఈనెల 12 నుంచి దరఖాస్తులు పొందవచ్చని, పూర్తిచేసిన వాటిని ఈనెల 17లోగా ఐటీడీఏ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఇంటర్, డిగ్రీ, బీఈడీ, డీఈడీ, టెట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి ఈనెల 20న ప్రకటిస్తామన్నారు. ఎంపికైన 300 మంది అభ్యర్థులకు సుమారు 75 నుంచి 90 రోజుల పాటు విశాఖపట్నం టీసీఆర్ అండ్ టీఎం సంస్థలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. మహిళ అభ్యర్థుల ఎంపికలో 33శాతం రిజర్వేషన్ అమలు చేస్తామన్నారు. అర్హత కలిగిన గిరిజన నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 08935 250833 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

12 కిలోల గంజాయి స్వాధీనం


- విలువ రూ.5 లక్షలు, ఐదుగురి అరెస్ట్
- ఆటో, బైక్, సెల్‌ఫోన్లు స్వాధీనం
- చింతపల్లి ఇన్‌చార్జి ఏఎస్పీ జగదీష్ అడహళ్లి వెల్లడి




గంజాయితో పట్టుబడిన నిందితులతో చింతపల్లి ఏఎస్పీ జగదీష్

చింతపల్లి: ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్న రూ.5 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకుని ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు చింతపల్లి ఇన్‌చార్జి ఏఎస్పీ జగదీష్ అడహళ్లి తెలిపారు. శనివారం మండలంలోని అన్నవరం పోలీసు స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ముందస్తు సమాచారం మేరకు లోతుగెడ్డ వంతెన వద్ద అన్నవరం ఎస్ఐ సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టారు. దీనిలో భాగంగా ఒడిశా సరిహద్దులోని చిత్రకొండ జోలాపాడం ప్రాంతం నుంచి కాకినాడ వెళ్తున్న ఆటోను పరిశీలించగా 102 కిలోల గంజాయి పట్టుబడిందని ఏఎస్పీ తెలిపారు. దీని విలువ సుమారు రూ.5 లక్షలకు పైగా ఉంటుందన్నారు. ఈ కేసులో ఆటో, బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఆయన వివరించారు. పట్టుబడిన వారిలో పాలమామిడికి చెందిన మర్రి శివరావు, లోతుగెడ్డకు చెందిన చిక్కం ప్రసాద్, బందవేలుకు చెందిన కుందేటి నాగేశ్వరరావు, చెరుకుపాలెంకు చెందిన ఎక్కేటి అర్జున్, దోమలగుందికి చెందిన బాబు ఉన్నారన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామని, కాకినాడకు చెందిన వ్యాపారులను అరెస్టు చేస్తామని తెలిపారు. గంజాయిని పూర్తిస్థాయిలో నివారించే చర్యల్లో భాగంగా వందరోజుల కార్యక్రమం చేపడుతున్నామని అయన చెప్పారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంత జిల్లాల ఎస్పీలతో ఇప్పటికే చర్చించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రమేష్, ఎస్ఐ రాజబాబు పాల్గొన్నారు.

ఇసుక తరలిపోతోంది



గోరాపూర్ గెడ్డలో ఇసుక తవ్వకాలు



పెద్దగెడ్డలో ఇసుక లోడింగ్

డుంబ్రిగుడ: మండలంలోని ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. కురిడి పంచాయతీ గోరాపూర్, జంగిడివలస పెద్ద గెడ్డ ప్రాంతాల్లో తవ్వకాలు జరుపుతున్నారు. లారీలు, ట్రాక్టర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వీటిపై అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



● మురిసిన పర్యాటకం

ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి సమీప చెరువులవేనంలో ప్రకృతి అందాలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. వీటిని తిలకించేందుకు శనివారం దూర ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఉదయ భానుడి అందాలను చూసి మురిసిపోయారు. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన తాజంగి జలాశయం వద్ద సందడి నెలకొంది.

– చింతపల్లి

క్లుప్తంగా

అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్న అధికారులు

- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్

పాడేరు : జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణంలోని డివిజనల్ పంచాయతీ కార్యాలయానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో గిరిజనేతరుడు దర్జాగా ఇళ్లు నిర్మించుకుంటున్నప్పటికీ పక్కనే ఉన్న అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తూ ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు చంటి శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. డీఎల్‌పీవో కార్యాలయానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలానికి ఎల్పీసీలు జారీ చేయడంతో పాటు ఇంటి పన్ను రశీదు ఇచ్చి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. గిరిజనేతరుడి అక్రమ నిర్మాణానికి అనుమతులు ఇవ్వడమేమిటని వారు ప్రశ్నించారు. కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి అక్రమ నిర్మాణాలను అడ్డుకట్ట వేయాలని, లేనిపక్షంలో తామే అడ్డుకుంటామని వారు స్పష్టం చేశారు.

ముంచంగిపుట్టు వాసికి రిమాండ్

అనకాపల్లి: గంజాయి కేసులో తప్పించుకుని తిరుగుతున్న ముంచంగిపుట్టు వాసిని స్థానిక గూడ్స్ రోడ్డు వద్ద అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ సత్యనారాయణ శనివారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.... మే 27వ తేదీన అనకాపల్లి రైల్వే స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఐదు కేజీల గంజాయితో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఈ కేసులో సంబంధం ఉన్న ముంచంగిపుట్టు మండలం బిలియగూడ గ్రామానికి చెందిన వంతల గురునాథ్ తప్పించుకున్నాడు. శనివారం అతడు గూడ్స్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించగా పై నేరాన్ని అంగీకరించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి 14 రోజులపాటు రిమాండ్ విధించారు.

నవంబరు వరకు విశాఖ-బెంగళూరు స్పెషల్ పొడిగింపు

తాటిచెట్లపాలెం(విశాఖ): విశాఖపట్నం-ఎస్ఎంవీ బెంగళూరు-విశాఖపట్నం మధ్య నడుస్తున్న స్పెషల్ నవంబరు వరకు పొడిగించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. విశాఖపట్నం-ఎస్ఎంవీ బెంగళూరు(08543) వీక్లీ స్పెషల్ ప్రతీ ఆదివారాలలో విశాఖపట్నంలో మధ్యాహ్నం 3.55 గంటలకు బయల్దేరి, మరుసటిరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు నవంబరు 24వ తేదీ వరకు పొడిగించబడింది. తిరుగు ప్రయాణంలో ఎస్ఎంవీ బెంగళూరు-విశాఖపట్నం (08544) స్పెషల్ ఎస్ఎంవీ బెంగళూరులో ప్రతీ సోమవారం మధ్యాహ్నం 3.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు నవంబరు 25వ తేదీ వరకు పొడిగించబడింది.

రోడ్డు 'బుగ్గి'పాలు



కంకర, క్రషర్‌తో గోతులను పూడ్చుతున్న జేసీబీ

- తూతూ మంత్రంగా అనకాపల్లి-చోడవరం రోడ్డు మరమ్మతు పనులు
- క్రషర్ బుగ్గితో గోతులు పూడుస్తున్న అధికారులు
- అవస్థలు పడుతున్న వాహనచోదకులు

తుమ్మపాల: రోడ్లపై ఎన్నికల ముందు నానా యాగీ చేసిన కూటమి నేతలు ఇప్పుడు వాటి మరమ్మతులపై చిత్తశుద్ధి చూపడం లేదు. గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరై, టెండర్లు కూడా పూర్తయినా కాంట్రాక్టర్ల నిర్లక్షంతో పనులు జరగలేదు. ఆ పనులను ఇప్పుడు తూతూ మంత్రంగా చేస్తున్నారు. గోతులమయమైన అనకాపల్లి - చోడవరం రోడ్డు ఇప్పుడు అత్యంత దారుణంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు చేరి వాహనాల రాకపోకలతో అవి మరింత పెద్దవిగా తయారయ్యాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే బెంబేలెత్తుపోతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే రోడ్లను అద్దంలా మార్చేస్తామని టీడీపీ, జనసేన, బీజేపీలు ఎన్నికల ముందు ప్రచారంతో ఊదరగొట్టాయి. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత హామీలను గాలికొదిలేశారు. ఈ రోడ్డుపై గుంతలను కంకర, క్రషర్ బుగ్గితో పూడ్చుతున్నారు. పనులు ప్రారంభించిన వెంటనే రోడ్లు అభివృద్ధి చెందుతాయని అంతా ఆశించారు. ఆ పనులు చూసిన తరువాత అంతా ఇప్పుడు షాక్ అవుతున్నారు. కేవలం కంకర, క్రషర్ బుగ్గితో గోతులు పూడ్చి చేతులు దులుపుకొంటుండంతో క్రషర్ బుగ్గి కళ్లలో పడి ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. మరమ్మతులు చేసిన మరుసటి రోజే మళ్లీ రోడ్డుపై గోతులు ప్రత్యక్షమయ్యాయి. గోతుల పక్కనే మురుగునీరు నిలిచిపోయి వాహనదారులకు మరింత ఇబ్బందులు కలిగిస్తోంది.



పూడ్చిన గోతుల వద్ద నిలిచిపోయిన మురుగునీరు



రోడ్డుమధ్యలో నీటితో నిండిన గోతులు(ఫైల్)

అడుగుకో గొయ్యి

అత్యంత దారుణంగా ఉన్న అనకాపల్లి నుంచి వడ్డాది వరకు సుమారు 30 కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ రోడ్డుపై అడుగుకో గొయ్యి ఉంది. వర్షం పడితే ఆ గోతులు నీటి కుంటల్లా మారుతున్నాయి. ఈ రోడ్డు మరమ్మతులకు ప్రస్తుత ప్రభుత్వం కేవలం రూ.30 లక్షలు నిధులిచ్చి చేతులు దులుపుకొంది. ఈ నిధుల్లో జీఎస్టీ పోను మిగిలిన రూ.22 లక్షలతో మరమ్మతులులు చేపట్టడం మా వల్ల కాదంటూ అధికారులు కంకర, క్రషర్ బుగ్గితో గోతులు పూడ్చి సరిపెడుతున్నారు.

దర్జీనగర్ వద్ద అధ్వానం



ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా ఉంది. గోతులతో దారుణంగా తయారైంది. దర్జీనగర్ వద్ద పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఉంది. పెద్దపెద్ద గోతుల కారణంగా ద్విచక్ర చోదకులు చాలా సార్లు ప్రమాదాలకు గురయ్యారు. ద్విచక్రవాహనాలపై కుటుంబంతో కలిసి ప్రయాణించడం మానేశాం. రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి మా కష్టాలు తీర్చాలి.

–బి.నితీష్, కాపుశెట్టివానిపాలెం

బుగ్గి కళ్లలో పడుతోంది



ఇటీవల కంకర, క్రషర్ బుగ్గి వేసి గోతులు పూడ్చారు. ఆ బుగ్గి గాలిలో తేలి ప్రయాణికుల కళ్లలో పడుతోంది. గోతులు షరా మామూలుగానే తయారవుతున్నాయి. నీరు వెళ్లేందుకు మార్గాన్ని ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డుపై నిలిచిపోతోంది. గోతులు పూడ్చి పైన కనీసం తారు కూడా వేయలేదు. కంకరతో కప్పి చేతులు దులుపుకొన్నారు. శాశ్వత మరమ్మతులు చేయలేదు. – పీలా బుజ్జి, తుమ్మపాల

రూ.30 లక్షలతో మరమ్మతులు

అనకాపల్లి – చోడవరం రోడ్డు మరమ్మతులకు అత్యవసర నిధుల కింద ప్రభుత్వం రూ.30 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో మరమ్మతులు చేస్తున్నాం. గత ప్రభుత్వంలో రోడ్డు అభివృద్ధికి టెండర్లు ప్రక్రియ జరిగినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు నిలిచిపోయాయి.

–ఏఈ ప్రభు, ఆర్‌అండ్‌బీ శాఖ, అనకాపల్లి

ఒలింపిక్స్‌లో భారత్ గెలుపు..

- నక్కపల్లిలో హాకీ క్రీడాకారుల సంబరాలు



జాతీయజెండాతో ర్యాలీ చేస్తున్న క్రీడాకారులు

నక్కపల్లి: పారిస్ ఒలింపిక్స్‌లో హాకీలో భారత విజయకేతనం ఎగుర వేసి పతకం సాధించడంతో నక్కపల్లిలో హాకీ క్రీడాకారులు సంబరాలు జరుపుకొన్నారు. శనివారం నక్కపల్లి బీఎస్ హాకీ క్లబ్ విద్యార్థులు పట్టణంలో జాతీయ జెండా పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. హాకీ మైదానంలో కేక్ కట్ చేసి కేరింతలు కొట్టారు. భారత హాకీ జట్టు స్పెయిన్‌లో జరిగిన పోటీల్లో 2-1 తేడాతో విజయం సాధించి కాంస్య పతకాన్ని సాధించడం గొప్ప విషయమన్నారు. భారత జాతీయ జెండా పట్టుకొని జై భారత్ అంటూ నినాదాలతో స్వీట్లు పంపిణీ చేశారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు వహిదా ఎంపిక



తుమ్మపాల: ఈ నెల 17 నుంచి 20 వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు పట్టణానికి చెందిన క్రీడాకారిణి ఎస్కే వహిదా ఎంపికైనట్లు కోచ్ సిహెచ్ చందు తెలిపారు. విజయనగరం రాజీవ్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 9, 10 తేదీల్లో జరిగిన 41వ రాష్ట్రస్థాయి జూనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్-2024లో వహిదా పూమ్‌సే విభాగంలో బంగారు పతకం, క్యోరుగి అండర్ 49 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించిందన్నారు. విజయనగరం మేయర్ వేంపాడు విజయలక్ష్మి చేతుల మీదుగా మెడల్ స్వీకరించినట్లు తెలిపారు.

మోదమ్మను దర్శించుకున్న విజయనగరం న్యాయమూర్తి



మోదకొండమ్మను దర్శించుకున్న విజయనగరం జిల్లా అదనపు జడ్జి దుర్గయ్య కుటుంబం



జడ్జి కుటుంబ సభ్యులకు మోదకొండమ్మ ఫొటో అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లిని విజయనగరం అదనపు జిల్లా న్యాయమూర్తి జి.దుర్గయ్య కుటుంబ సభ్యులతో పాటు దర్శించుకున్నారు. శనివారం ఆలయానికి విచ్చేసిన న్యాయమూర్తిని, కుటుంబ సభ్యులను ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం,ఆలయ కమిటీ ప్రతినిధులు స్వాగతం పలికారు.అనంతరం మోదమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా న్యాయమూర్తి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు దుశ్శాలువాతో సత్కరించి, మోదమ్మ ఫొటో,ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు,న్యాయవాది తమర్బ ప్రసాద్ నాయుడు,స్థానిక కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గమ్యం కుదించిన రైళ్లు

తాటిచెట్లపాలెం(విశాఖ): ఈనెల 15,17వ తేదీల్లో విశాఖ-పలాస-విశాఖ (07470/07471) మెము స్పెషల్ శ్రీకాకుళం వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తుంది. ఈ తేదీల్లో ఈ రైళ్ల శ్రీకాకుళం రోడ్-పలాస మధ్య రాకపోకలు సాగించవు.

- ఈనెల 11వ తేదీన విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం-బ్రహ్మపూర్(08532) స్పెషల్ శ్రీకాకుళం రోడ్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 12వ తేదీన బ్రహ్మపూర్‌లో బయల్దేరాల్సిన బ్రహ్మపూర్-విశాఖపట్నం (08531) స్పెషల్ శ్రీకాకుళం రోడ్ నుంచి బయల్దేరుతుంది.

జీతాల కోసం భిక్షాటన



రోడ్డు పక్కన భిక్షాటన చేస్తున్న కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు వేతనాల కోసం శనివారం వినూత్న నిరసన చేపట్టారు. కొన్ని నెలలుగా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఆలస్యంగా జీతాలు చెల్లిస్తున్న నేపథ్యంలో ఈ నెల ఒకటో తేదీ నుంచి వీరు ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు ఎల్‌అండ్‌డీ సీ కూడలి నుంచి ఉక్కు అడ్మిన్ కూడలి వరకు రోడ్డు పక్కన బైఠాయించి భిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యువ కార్మికులు మాట్లాడుతూ తమకు జీతాలు చెల్లించడంపై యాజమాన్యం కావాలనే జాప్యం చేస్తోందన్నారు. యాజమాన్యం ఇకనైనా తమ బాధలు అర్థం చేసుకుని సకాలంలో జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు పరంధామయ్య, డీఐటీయూ ప్రధాన కార్యదర్శి బి.డేవిడ్ వారికి సంఘీభావం తెలిపారు.

ఆదివాసీ వేడుకల్లో హుషారుగా.. అంతలోనే విషాదం



రాజవొమ్మంగిలో శుక్రవారం జరిగిన ఆదివాసీ దినోత్సవంలో చిన్నారులతో ఫొటో దిగిన పెద్దబ్బాయి

గుండెపోటుతో ప్రత్తిపాడు ఏఎస్‌ఐ మృతి



పెద్దబ్బాయి (ఫైల్

రాజవొమ్మంగి: ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జరిగిన వేడుకల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్న ప్రత్తిపాడులో ఏఎస్‌ఐ పూసం పెద్దబ్బాయి(60) మరుసటి రోజు తీవ్రమైన గుండెనొప్పితో మృతిచెందంతో విషాదం అలుముకుంది. మండలంలోని లాగరాయి గ్రామానికి చెందిన పూసం పెద్దబ్బాయి జేఏసీ సభ్యునిగా రాజవొమ్మంగిలో శుక్రవారం జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. బంధువులు, స్నేహితులు, తోటి నాయకులతో కలసి కార్యక్రమం ముగిసే వరకు ఉన్నారు. చిన్నారులతో సెల్ఫీలు దిగారు. శనివారం ఉదయం ఇంటి వద్ద ఛాతీలో నొప్పి రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఆయనను కాకినాడ తరలించారు. పరిస్థితి విషమించి మరణించారు. పెద్దబ్బాయి మరణంతో స్వగ్రామం లాగరాయి, మండలంలో తీవ్ర విషాదం అలముకొంది. పెద్దబ్బాయికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మత్తు.. యువత చిత్తు

బీచ్‌రోడ్డు (విశాఖ): డ్రగ్స్, గంజాయి లాంటి మాదక ద్రవ్యాల వినియోగానికి, చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్'కార్యక్రమంలో భాగంగా శనివారం ఆర్.కె. బీచ్ రోడ్డులో అవగాహన ర్యాలీ జరిగింది. కాళీమాత ఆలయం వద్ద నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చితో కలిసి కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి మహమ్మారి చాలా సమస్యలకు మూలకారణంగా నిలుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల దుష్ప్రభావాల బారి నుంచి బయటపడేందుకు డీ అడిక్షన్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కళాశాల, యూనివర్సిటీ విద్యార్థులు క్యాంపస్ అంబాసిడర్లుగా తయారవ్వాలని.. తోటి యువతలో మార్పు తీసుకురావాలన్నారు. సీపీ బాగ్చి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా జాతీయ సమస్య.. దీన్ని అరికట్టేందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఫ్యాషన్‌గా భావించి యువత మత్తులోకి దిగవద్దని.. తర్వాత బాధపడొద్దని హితవు పలికారు. ర్యాలీలో సాంఘిక సంక్షేమ డి.డి.రామారావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవి, విద్య, న్యాయ, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

టీనేజీ కుర్రాడు.. మోడలింగ్‌లో మొనగాడు

- మిస్టర్ టీన్ ఫైనల్స్‌కు ఏటికొప్పాక విద్యార్థి ఎంపిక
- యలమంచిలి జెడ్పీటీసీ సంధ్యారాణి కుమారుడి ఘనత
- తెలుగు ప్రజలంతా ఆదిత్యనాయుడుకు ఓట్లు వేయాలని విజ్ఞప్తి



యలమంచిలి రూరల్: మిస్టర్ టీన్ – 2024 పోటీల ఫైనల్స్‌కు ఏటికొప్పాక విద్యార్థి శానాపతి ఆదిత్యనాయుడు (16) దూసుకెళ్లాడు. జాతీయ స్థాయిలో ఈ పోటీలను ఢిల్లీ కేంద్రంగా అలీ క్లబ్ ఏటా నిర్వహిస్తోంది. గతంలో పట్టణాలు, పెద్ద నగరాల యువతకే పరిమితమైన ఈ తరహా పోటీల్లో మొదటి సారిగా గ్రామీణ ప్రాంత విద్యార్థి ప్రతిభ చూపుతున్నాడు. యలమంచిలి జెడ్పీటీసీ సభ్యురాలు శానాపతి సంధ్యారాణి, రాముల చిన్న కుమారుడు ఆదిత్యనాయుడుకు మోడలింగ్, గ్లామర్‌పై ఆసక్తి ఎక్కువ. ఓ ప్రైవేట్ స్కూల్‌లో సీబీఎస్ఈ ప్లస్-2 చదువుతున్న అతడి అభిరుచిని గుర్తించిన తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించారు. దాంతో ఇటీవల అలీ క్లబ్ సంస్థ ఢిల్లీలో నిర్వహించిన మిస్టర్ టీన్ సెమీఫైనల్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు.

31న ఢిల్లీ వేదికగా ఫైనల్స్....

దేశవ్యాప్తంగా 167 నగరాలు, పట్టణ ప్రాంతాల నుంచి 271 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ చూపిన 50 మందిని సెలెక్టర్లు ఫైనల్స్‌కు ఎంపిక చేశారు. వీరిలో ఆదిత్యనాయుడు కూడా ఉన్నాడు. ఈ నెల 31న ఢిల్లీలో తుది పోటీలు జరగనున్నాయని ఆదిత్యనాయుడు శనివారం రాత్రి సాక్షికి తెలిపాడు. తుది పోటీలకు వారం రోజుల ముందు ఢిల్లీలో శిక్షణ ఉంటుంది. ఆ తర్వాత ఎస్ఎంఎస్ ఆన్‌లైన్ ఓటింగ్ ఉంటుంది. వీటి ఆధారంగా విజేతలను ఎంపిక చేస్తారు. విజేతల పేర్లకు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కల్పిస్తారు. అంతేకాకుండా విజేతలను వివిధ బహుళజాతి సంస్థలు తమ బ్రాండ్ అంబాసిడర్లుగా నియమించుకుంటాయి. ఆదిత్యనాయుడు అలీ క్లబ్ మిస్టర్ టీన్ ఫైనల్స్‌కు ఎంపిక కావడంతో ఏటికొప్పాక వాసులు గర్వపడుతున్నారు. తమ మధ్య పుట్టి పెరిగిన యువకుడు మోడలింగ్, గ్లామర్ రంగంలో రాణించడం పట్ల గ్రామస్తులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ కుమారుడు సోషల్ మీడియాలో వీడియోలు చూసి సరదాగా మొదలు పెట్టాడని, ఈ రంగంలో జాతీయ స్థాయి పోటీలకు చేరుకోవడం ఆనందంగా ఉందని ఆదిత్యనాయుడి తల్లిదండ్రులు సంధ్యారాణి, రాములు చెప్పారు. ఫైనల్స్‌లో తమ కుమారుడికి తెలుగు రాష్ట్రాల ప్రజలంతా ఓట్లు వేసి మద్దతునివ్వాలని కోరారు.